రూ.లక్ష కొట్టు.. బెల్టు పట్టు

- నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో 15 షాపులకు అనుమతి
- గ్రామాల్లో 300కిపైగా బెల్టుషాపుల ఏర్పాటుకు రంగం సిద్ధం
- ఒక్కొక్క బెల్టు షాపునకు రూ.లక్ష వరకు వసూలు
- మామూళ్ల మెయింటెనెన్స్ కింద నెలకు రూ.1500



కొండపల్లిలో 30వ నంబరు జాతీయ రహదారికి ఆనుకొని పక్కపక్కనే నూతనంగా ఏర్పాటు చేసిన రెండు మద్యం షాపులు

జి.కొండూరు: మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం పాలసీ ఆ దిశగా దినదినాభివృద్ధి చెందుతుంది. మద్యం నియంత్రణలో భాగంగా పరిమితికి లోబడి గత ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీని రద్దు చేసిన రాష్ట్ర ప్రభుత్వం, లాటరీ ద్వారా ప్రైవేటు వ్యక్తులకు మద్యం షాపులను కట్టబెట్టింది. ఇదే అదునుగా భావించిన మద్యం సిండికేట్లు అటు లాటరీ ఫీజు, లైసెన్సు ఫీజు, రెంట్‌లు, సిబ్బంది వేతనాల రూపంలో అయ్యే ఖర్చును రాబట్టేందుకు, ఆదాయం పెంచుకునేందుకు బెల్టు మార్గానికి తెరలేపారు. విచ్చలవిడిగా గ్రామాల్లో బెల్టు షాపులు ఏర్పాటుసేందుకు సిండికేట్లు అందరూ ఏకమై గ్రామాల వారీగా పంచుకొని షాపులను ఏర్పాటు చేసేలా వ్యూహం పన్నారు.

నియోజకవర్గంలో పరిస్థితి ఇదీ...

మైలవరం నియోజకవర్గంలోని రెడ్డిగూడెం 2, మైలవరం 4, జి.కొండూరు 4, కొండపల్లి 2, ఇబ్రహీంపట్నం 3 మద్యం షాపులకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మద్యం షాపులను దక్కించుకున్న సిండికేట్ యజమానులు ఇప్పటికే షాపులను ఏర్పాటు చేసి మద్యం విక్రయిస్తున్నారు. ఇక తమ వ్యాపారాన్ని పెంచుకునేందుకు సిండికేట్లు అందరూ ఏకమై బెల్టుషాపుల ఏర్పాటుకు తెరలేపారు. మండలాల వారీగా ఉన్న షాపుల యజమానులు గ్రామాలను పంచుకొని జనాభా ప్రాతిపదికన ఒక్కొక్క గ్రామంలో రెండు నుంచి ఐదు బెల్టు షాపుల వరకు ఏర్పాటు చేసేలా ప్రణాళిక సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. ఈ రకంగా మైలవరం నియోజకవర్గంలోని ఈ నాలుగు మండలాల పరిధిలో ఒక్కొక్క మద్యం షాపు పరిధిలో 20 బెల్టుషాపుల చొప్పున 300కి పైగా బెల్టు షాపులు ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం.

నెలకు రూ.30కోట్లకు పైగా విక్రయాలే లక్ష్యం

మద్యం షాపులను దక్కించుకున్న సిండికేట్ యజమానులు తమకు అదనంగా అయ్యే ఖర్చులైనటువంటి షాపుల రెంట్లు, సిబ్బంది వేతనాలు, లాటరీ ఫీజులు, లైసెన్సు ఫీజులు, లంచాలను సైతం బెల్టు షాపుల నుంచి రాబట్టేందుకు సిద్ధమైనట్లు తెలుస్తుంది. ఈ క్రమంలోనే ఒక్కొక్క బెల్టు షాపు ఏర్పాటు చేయాలంటే రూ.1లక్ష తమకు డిపాజిట్ చేయాలని ఆశావహులకు హుకుం జారీ చేసినట్లు తెలుస్తుంది. అంతే కాకుండా నెలవారీ మామూళ్ల మెయింటెనెన్స్ పేరుతో రూ.వేయి నుంచి రూ.1500 వరకు చెల్లించాలని చెప్పినట్లు తెలుస్తుంది. ఈ విధంగా ఒక్కొక్క మద్యం షాపు నుంచి రోజుకి రూ.5లక్షల నుంచి 10 లక్షల వరకు విక్రయాలు జరిగేలా వ్యూహరచన చేస్తున్నారు. ఈ విధంగా ఈ నాలుగు మండలాల్లో నెలకు రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు వరకు మద్యం వ్యాపారం జరిగే అవకాశం ఉంది.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు

ఆర్డీఓ మొవిడి వాణి

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (మీకోసం)లో వచ్చే అర్జీలను గడువులోగా అధికారులు పరిష్కరించాలని, అలసత్వం వహించొద్దని ఆర్డీఓ మొవిడి వాణి ఆదేశించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలపై ఇచ్చే ప్రతి అర్జీనీ ఆన్‌లైన్ చేస్తామని చెప్పారు. దీంతో అర్జీ పరిష్కారమైందా, లేదా అనే విషయాన్ని కలెక్టర్ నుంచి సీఎం వరకు ఎప్పుడైనా చూడొచ్చని గుర్తుచేశారు. పరిష్కారానికి వీలవ్వకపోతే సంబంధిత కారణాన్ని చూపించాలన్నారు.

మీ కోసంలో 10 అర్జీలు రాగా, అందులో పింఛన్లు మంజూరు చేయాలని, భూమిని సర్వే చేయాలని, ఆక్రమణలు తొలగించాలని తదితర సమస్యలు ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ చిలుకూరి భాస్కరరెడ్డి, సీడీపీఓ ఎస్‌వై నూరాని, డీఎల్‌డీఓ వెంకటరత్నం, హెచ్‌వో ఆర్.హేమ తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్‌పై టీడీపీ కవ్వింపు చర్యలు

జి.కొండూరు: మండల పరిధి గంగినేనిపాలెం గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ బీసీ నాయకుడు పిల్లి రామారావుపై స్థానిక టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు దిగారు. రామారావుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతూ గత రెండు రోజులుగా వేధింపుల పర్వం కొనసాగిస్తున్నారు. టీడీపీ నాయకులు చేస్తున్న అనుచిత వ్యాఖ్యలకు విసిగెత్తిపోయిన సర్పంచ్ రామారావు, ఇద్దరు టీడీపీ నాయకులు ఆలా గోపాలకృష్ణ, పటాపంచుల అప్పారావుపై సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గంగినేని గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి అధికారులు ఆదివారం శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రొటోకాల్ నిబంధనల ప్రకారం సర్పంచ్ హోదాలో పిల్లి రామారావు హాజరయ్యారు. ఈ సందర్భంగా తీసిన ఫొటోలను పిల్లి రామారావు సోషల్ మీడియాలో పోస్టు చేశారు. ఇక అంతే టీడీపీ నాయకులు ఈ ఫొటోలను షేర్ చేస్తూ మా ప్రభుత్వంలో నీ హడావిడీ ఏంట్రా అంటూ అనుచిత వ్యాఖ్యలతో రెచ్చగొట్టే విధంగా కొటేషన్‌లను రాసి సోషల్ మీడియాలో పోస్టులు చేస్తున్నారు. ఈ విధంగా గంగినేని గ్రామంతో పాటు పరసర గ్రామాలకు చెందిన యువ టీడీపీ నాయకులంతా సర్పంచ్ రామారావును రెచ్చగొట్టే విధంగా పోస్టులు పెట్టసాగారు. దీంతో విసిగెత్తిపోయిన సర్పంచ్ రామారావు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

కానిస్టేబుల్ నరేంద్రకు ఘన నివాళి


నరేంద్ర చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎస్‌ఐ శుభశేఖర్, నరేంద్ర భార్య

ఆగిరిపల్లి: పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని ఆగిరిపల్లిలో ఎస్‌ఐ శుభశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. గత ఏడాది ఆగిరిపల్లిలో విధి నిర్వహణలో ఉండగా ఒక దుండగుడి చేతిలో ప్రాణాలు కోల్పోయిన పోలీస్ కానిస్టేబుల్ గంధం నరేంద్ర చిత్రపటానికి ఎస్‌ఐతో పాటు నరేంద్ర భార్య గంధం లక్ష్మీప్రియ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆగిరిపల్లిలో పోలీసుల ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులతో నాలుగు రోడ్ల కూడలిలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎస్‌ఐ మాట్లాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు తమ ప్రాణాలను సైతం లెక్కచేయరన్నారు. అమరులైన పోలీసుల ఆశయ సాధన కోసం కృషి చేద్దామని చెప్పారు. అనంతరం గౌరవ వందనం చేశారు. ఏఎస్‌ఐ తవేరియా నాయక్, పోలీస్ సిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖో-ఖోకు మల్లెల విద్యార్థులు ఎంపిక

తిరువూరు: రాష్ట్ర స్థాయి ఖో-ఖోకు తిరువూరు మండలం మల్లెలకు చెందిన శ్రీనన్నక నరేంద్ర ధనలక్ష్మి మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం వేముల శ్రీధర్ సోమవారం తెలిపారు. ఉమ్మడి కృష్ణా జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20వ తేదీన గుడివాడ ఎస్పీఎస్ మున్సిపల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లాస్థాయి ఖో-ఖో పోటీలను నిర్వహించారు. ఆ పోటీల్లో పాఠశాలకు చెందిన గొట్టం ఉమ, గుంజి వెంకటేశ్వరరావు, పల్లపు జస్వంత్‌లు ప్రతిభ కనపర్చటంతో అధికారులు రాష్ట్ర స్థాయి టీమ్‌కు ఎంపిక చేశారు. విద్యార్థులు, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్.కృష్ణప్రసాద్‌ను మండల విద్యాశాఖాధికారి-1 ఎ.శ్యామ్‌సుందర్, ఉపాధ్యాయులు అభినందించారు.

హిజ్రాల మధ్య ఆధిపత్యపోరు

ఇబ్రహీంపట్నం: విజయవాడ, ఇబ్రహీంపట్నంకు చెందిన హిజ్రాల మధ్య ఆధిపత్య పోరు వివాదానికి దారితీసింది. కొండపల్లిలో రెండు వర్గాలకు చెందిన హిజ్రాలు సోమవారం గొడవపడ్డారు. వీరిమధ్య చెలరేగిన గొడవతో ఆప్రాంతంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ఇబ్రహీంపట్నంకు చెందిన హిజ్రాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెండు వర్గాలతో పోలీస్ స్టేషన్‌లో సైతం ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. తమకు న్యాయం చేయాలంటూ రెండువర్గాల హిజ్రాలు చప్పట్లు కొడుతూ నినాదాలు చేయడంతో కొద్దిసేపు ఏమి జరుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. ఓ సమయంలో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. చివరకు రెండు వర్గాల వారి వద్ద ఫిర్యాదులు స్వీకరించి విచారణ చేపట్టారు.

సిమెంట్ రోడ్లు శరవేగంగా నిర్మించాలి

నూజివీడు: గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనుల నిర్వహణ తీరును నిరంతరం గమనిస్తుండటంతో పాటు ఇటీవల గ్రామాల్లో శంకుస్థాపన చేసిన సిమెంట్ రోడ్ల నిర్మాణాన్ని 40 రోజుల్లోగా పూర్తి చేసేలా చూడాలని ఎంపీడీఓ సి.రాఘవేంద్రనాథ్ చెప్పారు. పంచాయతీల కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సమీక్షించారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

మైలవరం: విద్యార్థులు స్పష్టత, దిశా నిర్దేశం స్వీయ అవగాహన, కెరీర్ ఎంపికలను అన్వేషించడం ద్వారా గోల్ సెట్టింగును ఏర్పచుకోవడం జరుగుతుందని ప్రిన్సిపాల్ డాక్టర్ ఇళ్ళ రవి తెలిపారు. మైలవరం డాక్టర్ లకిరెడ్డి హనిమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో కెరీర్ గైడెన్స్ ప్రోగ్రామ్‌ను ప్రిన్సిపాల్ డాక్టర్ రవి సోమవారం ప్రారంభించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల కంప్యూటర్ విభాగానికి చెందిన అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బి. రాజేంద్రప్రసాద్ రిసోర్స్ పర్సన్‌గా హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ బి. రాజేంద్రప్రసాద్ కెరీర్ గైడెన్స్ గురించి వివరించారు. విద్యార్థి దశ నుంచే భవిష్యత్‌కు పునాదులు వేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో చరిత్ర అధ్యాపకులు డి. శ్రీనివాసరావు, ఇతర అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు రక్తదాన శిబిరం

విస్సన్నపేట: లయన్స్‌క్లబ్ ఆఫ్ విస్సన్నపేట ఆధ్వర్యంలో ఆంధ్రా లయన్స్ బ్లడ్ బ్యాంక్ వారి నిర్వహణలో, వికాస్ విద్యా సంస్థల సహకారంతో స్థానిక వికాస్ ఫార్మసీ కళాశాలలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి రక్తదాన శిబిరం నిర్వహిస్తామని క్లబ్ అధ్యక్షుడు వీర్ల కిరణ్ తెలిపారు. సీనియర్ క్లబ్ సభ్యులు పాల్గొని శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు.

బంజరు సాగుభూమికి పట్టాలు ఇవ్వాలి

తిరువూరు: నియోజకవర్గంలోని బంజర్‌భూముల్లో దీర్ఘకాలంగా వ్యవసాయం చేసుకొంటున్న వ్యవసాయ కూలీలకు పట్టాలు మంజూరు చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వరరావు అన్నారు. ఈ విషయమై తిరువూరు ఆర్డీఓ మాధురికి వ్యవసాయ కార్మికసంఘం ఆధ్వర్యంలో సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా బంజరు భూముల్ని సాగుచేస్తుకొని కూలీలు తమ జీవనం గడుపుతున్నారన్నారు. సంబంధిత కూలీలకు సాగుహక్కు చట్టం ద్వారా పట్టాలు ఇవ్వాలని కోరారు. నియోజకవర్గ అధ్యక్షులు షేక్ నాగుల్‌మీరా మాట్లాడుతూ పల్లెపండుగ ద్వారా గ్రామాల్లో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా చేపడుతున్న పనులను కాంట్రాక్టర్‌లు యంత్రాలతో కాకుండా కూలీలతో చేయించాలన్నారు. సీపీఐ పట్టణశాఖ కార్యదర్శి ఎం.ఉదయ్, సహాయ కార్యదర్శి షేక్ సుభాని తదితరులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని బాణసంచా దుకాణాలపై చర్యలు

ఆర్డీవో హెచ్చరిక

నూజివీడు: డివిజన్ పరిధిలోని మండలాల్లో నిబంధనలను ఉల్లంఘించి బాణసంచా దుకాణాలను ఏర్పాటు చేస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆర్డీఓ మొవిడి వాణి హెచ్చరించారు. స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో దీపావళి సందర్భంగా బాణసంచా తాత్కాలిక దుకాణాల ఏర్పాటుపై రెవెన్యూ, పోలీస్, ఫైర్, మున్సిపాలిటీ, విద్యుత్‌శాఖ అధికారులతో పాటు దుకాణాల కోసం దరఖాస్తు చేసుకున్న వ్యాపారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ దుకాణాలను ఊరికి దూరంగా ఏర్పాటు చేసుకోవాలని, షాపుల మధ్య మూడు మీటర్ల దూరం ఉండాలని, దుకాణాల ఏర్పాటుకు కేవలం రేకులను మాత్రమే వాడాలని చెప్పారు. ప్రతి దుకాణం వద్ద నాలుగు డ్రమ్ముల్లో నీటిని, ఇసుకను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేసి వివరాలను త్వరితగతిన అందించాలన్నారు. దుకాణదారులు నిబంధనలను పక్కాగా పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏఓ సి. ఉదయభాస్కర్, నూజివీడు మున్సిపల్ కమిషనర్ ఆర్.వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

మైలవరం: కూటమి ప్రభుత్వం ఉపాధ్యాయ, విద్యా రంగంలోని సమస్యలు పరిష్కారానికి చొరవ చూపడం లేదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్రోపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి యం.బసవయ్య తెలిపారు. మైలవరంలోని రాష్ట్రోపాధ్యాయ సంఘం కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడుస్తున్నప్పటికీ ఉపాధ్యాయ, విద్యా రంగం సమస్యలపై దృష్టి పెట్టడం లేదన్నారు. 12వ పీఆర్‌సీ కమిషన్ వెంటనే నియమించి, 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలని కోరారు. 117 జీవోను రద్దు చేయాలని తెలిపారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాలకు దూరంగా ఉంచాలని కోరారు. ఉపాధ్యాయుల కొరత లేకుండా చూడాలని, తల్లికి వందనం పథకాన్ని ప్రభుత్వ పాఠశాలలకే వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన పెండింగ్ బకాయిలను మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గంపలగూడెం: మండలంలోని పెనుగొలను విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 10 గ్రామాల్లో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్‌శాఖ ఏఈ జగదీష్ తెలిపారు. రాజవరం, పెనుగొలను, జింకలపాలెం, రాజులపాలెం, చల్లగుండ్లవారిపాలెం, సత్యాలపాడు, మేడూరు, ఆర్లపాడు, తునికిపాడు, దుందిరాలపాడు, చెన్నవరం గ్రామాల్లో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

నేటి నుంచి ఆధార్ మొబైల్ క్యాంపులు

గంపలగూడెం: మండలంలో ఈ నెల 22వ తేదీ నుంచి ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చెన్నయ్య తెలిపారు. 22, 23 తేదీల్లో గంపలగూడెం సచివాలయం-1లో, 24, 25 తేదీల్లో గంపలగూడెం సచివాలయం-2లో, 22వ తేదీ నుంచి 25వ తేదీ వరకు ఈ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

విస్సన్నపేట: మండలంలోని ఆయా గ్రామాలకు ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఆధార్ క్యాంప్ స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నుంచి 25వ తేదీ వరకు నిర్వహిస్తామని ఎంపీడీఓ సీహెచ్ చిన్నరాట్నాలు సోమవారం తెలిపారు. మంగళవారం ఉదయం నుంచి విస్సన్నపేట గ్రామం వారికి, బుధవారం చంద్రుపట్ల, లంబాడీతండా, తెల్లదేవరపల్లి, పుట్రేల గ్రామాల వారికి, గురువారం వేమిరెడ్డిపల్లి, కొర్లమండ, మారేమండ, శుక్రవారం నరసాపురం, తాతకుంట్ల, కొండపర్వ గ్రామాల వారికి ఆధార్ క్యాంప్ నిర్వహిస్తామన్నారు.

తిరువూరు: మండలంలో మంగళవారం నుంచి ప్రత్యేక ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ నాగేశ్వరరావు తెలిపారు. ఈ నెల 22, 23న ఆంజనేయపురం, ముష్టికుంట్ల, 24, 25 తేదీల్లో కోకిలంపాడు అక్కపాలెం సచివాలయాల్లో ఆధార్ మొబైల్ క్యాంపులు నిర్వహిస్తామన్నారు.

ఆగిరిపల్లి: మండలంలో ఈనెల 22 నుంచి 25 వరకు ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ భార్గవి తెలిపారు. ఆధార్‌లో మార్పులు, చేర్పులకు ఈ శిబిరాలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 22, 23 తేదీల్లో ఆగిరిపల్లి, 24, 25 తేదీల్లో శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

కట్టలేరుకు మళ్లీ వరద

గంపలగూడెం: మండలంలోని ప్రధాన నీటి వనరైన కట్టలేరులో సోమవారం వరద మళ్లీ ఉధృతంగా పారుతుంది. ఎగువ తెలంగాణ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాల కారణంగా ఏరు తోటమూల-వినగడప గ్రామాల నడుమ గాడినిండా ప్రవహిస్తుంది. ఏటిపై రాకపోకల కోసం నిర్మించిన డైవర్షన్ రహదారిపైకి కూడా వరద నీరు ఎక్కుతుంది.

అమరవీరుల స్ఫూర్తితో ముందుకు సాగుదాం

డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్


మాట్లాడుతున్న డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్

నూజివీడు: శాంతిభద్రతలను కాపాడటంలో అవిశ్రాంతంగా పోరాడుతూ పోలీసులు ఎనలేని సేవలు చేస్తూ ప్రాణత్యాగాలు చేస్తున్నారని, అలాంటి వారిని స్మరించుకోవడమే పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం ముఖ్య ఉద్దేశమని నూజివీడు డీఎస్పీ కేవీవీఎన్‌వీ ప్రసాద్ చెప్పారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం నిర్వహించిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొన్న ఆయన పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరవీరుల త్యాగాలను స్ఫూర్తిగా తీసుకుంటూ వారి ఆశయ సాధనలో పోలీస్ శాఖ ముందుకు వెళ్లాలని, ప్రజలకు సేవలందించాలని చెప్పారు. పోలీసుల విధుల్లో ప్రజలను భాగస్వాములను చేసేందుకు విద్యార్థులకు పలు రకాల పోటీలు, రక్తదాన శిబిరాలు, ప్రజలకు అవగాహన సదస్సులను ఈ నెల 30 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం పట్టణ పోలీస్‌స్టేషన్ వద్ద నుంచి చిన్న గాంధీ బొమ్మ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పట్టణ సీఐ సత్య శ్రీనివాస్, పాల్గొన్నారు.

మైలవరం: పోలీస్ అమరవీరుల సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యాంగ పరిరక్షణ, ప్రజాస్వామ్య పరిరక్షణకై సమాజ శ్రేయస్సుకై అహర్నిశలు కర్తవ్యాన్ని నిర్వర్తిస్తుంటారన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాద చర్యల నుంచి ప్రజల ధన, మాన, ప్రాణ రక్షణకై తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి రాజీలేని పోరాటం చేస్తూ అసువులు బాసిన పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు.

జమిలి ఎన్నికలతో ప్రాంతీయ పార్టీల మనుగడ ప్రశ్నార్థకం

సీపీఎం రాష్ట్రం కార్యదర్శి వి.శ్రీనివాసరావు


తిరువూరులో విలేఖర్లతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

తిరువూరు రూరల్: రాష్ట్రాల హక్కులను కాలరాసేందుకే మోడీ ప్రభుత్వం జమిలీ ఎన్నికలను తీసుకొచ్చేందుకు ప్రయత్నిసుందని సీపీఎం రాష్ట్రం కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. సుందర విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. జమిలి ఎన్నికల పట్ల కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిపై ధ్వజమెత్తారు. ఒకే దేశం, ఒకే రాష్ట్రం పేరుతో జమిలీ ఎన్నికలు నిర్వహిస్తే ఖర్చు తగ్గుతుందని కేంద్రం సాకు చెబుతుందన్నారు, జమిలీ ఎన్నికల వల్ల ఖర్చు పెరుగుతుందన్నారు. ఇప్పుడు జరుగుతున్న విధానం వల్ల కార్పొరేట్ సంస్థలకు ఎన్నికల ఫండ్ ఇవ్వడానికి భారం అవుతుందని, దానిని తగ్గించేందుకు జమిలీ ఎన్నికలను తెచ్చే ప్రయత్నం చేస్తున్నారు తప్ప వేరే ఏమీ లేదన్నారు. దేశంలో అన్నిరకాల నిత్యావసరాల ధరలు పెరిగి సామాన్యులు తీవ్ర ఇబ్బందిపడుతున్నారన్నారు. ప్రభుత్వాలు వీటిని తగ్గించాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 8వ తేదీ నుంచి సీపీఎం దేశవ్యాప్తంగా ప్రజాపోరు నిర్వహిస్తుందని వెల్లడించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ట్రూఫ్ ఆఫ్ చార్జిలు పేరుతో రూ.8 వేల కోట్లు విద్యుత్ వినియోగదార్లపై మోపనుందని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి మరో రూ.20 వేల కోట్లు ట్రూఫ్ చార్జిలు వేయడానికి ప్రణాళిక రూపొందిస్తున్నారన్నారని వివరించారు. సాని కొమ్ము నాగేశ్వరరెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

రచయిత రఘునందన్‌కు సత్కారం


రఘునందన్‌ను సన్మానిస్తున్న ప్రతాప్, పార్థసారథి

తిరువూరు: తిరువూరు రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్‌కు ఘన సన్మానం లభించింది. ఐఎస్ఓ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళావేదిక తాడేపల్లిగూడెంలో ఆదివారం నిర్వహించిన కవి సమ్మేళనంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రఘునందన్ రైతు ఇబ్బందుల గురించి చదివిన కవిత ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకొంది. ప్రపంచ సాహిత్య, సాంస్కృతిక చరిత్రలో 24 గంటలూ నిర్విరామకవి సమ్మేళనంలో రఘునందన్‌కు ప్రత్యేక అవార్డు లభించింది. దీంతో రఘునందన్ పేరు అమేజింగ్ వరల్డ్ బుక్ ఆఫ్ రివార్డు, ఇంటర్నేషనల్ మార్వేల్ బుక్ ఆఫ్ రివార్డు, టీఎస్‌ఏ (తెలుగు అసోషియేషన్ ఆఫ్ నేషనల్ అకాడమీ) , కల్చరల్ టాలెంట్స్ బుక్ ఆఫ్ రికార్డుల్లో నమోదుచేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. కళావేదిక చైర్మన్ కత్తిమండ ప్రతాప్, జాతీయ ప్రధాన కార్యదర్శి టి.పార్థసారథి తదితరులు రఘునందన్‌ను సన్మానించి జ్ఞాపిక, ప్రశంసాపత్రం ఇచ్చారు. రఘునందన్ సాధించిన ఈ ఘనతపట్ల సాహితీ అభిమానులు, కవులు, రచయితలు హర్షం వ్యక్తపరచారు. గతంలో కూడా రఘునందన్ సాహితీ రంగంలో అనేక పురస్కారాలు పొందారు.

క్లుప్తంగా

కూరగాయలు అధిక ధరలకు అమ్మితే చర్యలు

మైలవరం: రైతు బజారులో కూరగాయలు ధరల పట్టికలో కంటే ఎక్కువగా అమ్మితే చర్యలు తప్పవని మార్కెటింగ్ డెప్యూటీ డైరెక్టర్ పి.లావణ్య తెలిపారు. మైలవరం రైతు బజారును సోమవారం ఆమె సందర్శించారు. అధిక ధరలకు కూరగాయలు విక్రయిస్తున్నట్లు ఫిర్యాదులు వస్తే షాపులు తొలగిస్తామని పేర్కొన్నారు. టమాటా, ఉల్లిపాయల ధరలు ఇటీవల ఎక్కువగా ఉండటంతో నేరుగా మార్కెటింగ్ శాఖ అధికారులు కర్నూలులో కొనుగోలు చేసి రైతు బజార్ల ద్వారా అమ్మిస్తున్నట్లు తెలిపారు. ఎవరైన అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీ ఎం.మంగమ్మ, మైలవరం రైతు బజారు ఎస్టేట్ ఇన్చార్జి అధికారి చిట్టిబాబు పాల్గొన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయాలి

ఇబ్రహీంపట్నం: కృష్ణానది వరదల్లో పూర్తిగా నష్టపోయిన అర్హులైన బాధితులకు న్యాయం చేయాలని కొండపల్లి వైఎస్సార్ సీపీ 26వ వార్డు కౌన్సిలర్ గుంజా శ్రీనివాస్ సబ్‌కలెక్టర్ చైతన్యను కోరారు. ఇబ్రహీంపట్నం, కొండపల్లి జగనన్న కాలనీలు, శ్రామిక నగర్ బాధితులతో కలసి విజయవాడ సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం వినతి పత్రం అందజేశారు. వరద నీటి ముంపుకు ఇళ్లల్లోని విలువైన వస్తు, సామగ్రి కోల్పోయామని వివరించారు. రెవెన్యూ, సచివాలయ సిబ్బంది అర్హులను గుర్తించడంలో విఫలమైనట్లు ఆరోపించారు. మరోసారి అర్జీలు స్వీకరించి తగిన న్యాయం చేయాలని కోరారు. సీఐటీయూ ఆధ్వర్యంలో కూడా సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ పాల్గొన్నారు.

డాక్టర్ పూర్ణయ్యకు అభినందనలు

మైలవరం: లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్స్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ పూర్ణయ్య ఎక్స్‌లెన్స్ ఇన్ రీసెర్చ్ కాంట్రీబ్యూషన్ అవార్డుకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు సోమవారం తెలిపారు. రీసెర్చ్ విభాగంలో చేసిన కృషికి గుర్తింపుగా నీతి అయోగ్ కౌన్సిల్ ఫర్ స్కిల్స్ అండ్ కాంపిటెన్సీస్ ఈ అవార్డు ప్రకటించినట్లు తెలిపారు. అవార్డుకు ఎంపికైన సందర్భంగా డాక్టర్ పూర్ణయ్య బిల్లాను కళాశాల ప్రెసిడెంట్ జి. శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ జి. శ్రీనివాసులు అభినందించారు.

పేకాట శిబిరంపై దాడి

మైలవరం: మండలంలోని కొత్తగూడెం గ్రామం శివారులో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ సుధాకర్ సోమవారం తెలిపారు. కొత్తగూడెం శివారులోని మామిడి తోటలో కోత ముక్క ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఆయన తన సిబ్బందితో దాడి చేశారు. బండారు కాసులు, రాజులపాటి పవన్ కుమార్, జానపాటి నాగ సత్యనారాయణ, కొంకాల గోపిరాజు, మేడూరి పుల్లారావును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. వీరి నుంచి పేకముక్కలు, రూ.4680 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో కేసులో మైలవరం వీఆర్‌ఓ విధులను అడ్డుకున్నందుకు ఉమ్మ రమణారెడ్డిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. మైలవరం మండలం గణపవరం గణపతి గట్టులోని మామిడి తోటలో ఇసుక డంప్ చేసిన సమాచారం అందుకున్న గణపవరం వీఆర్‌ఓ వై.నాగమణి ఇసుక డంప్ చేసిన స్థలాన్ని చేరుకుని సుమారు 30 ట్రక్కుల ఇసుక డంప్ చేసినట్లు గుర్తించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసింది. అధికారుల ఆదేశాల మేరకు ఇసుక లోడింగ్‌కు ఉపయోగించిన జేసీబీని, ట్రాక్టర్స్‌ను గ్రామ సచివాలయానికి తరలిస్తున్న నేపథ్యంలో రమణారెడ్డి అడ్డుకున్నాడని తెలిపారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

చాట్రాయి : మండలంలోని కృష్ణారావుపాలెం తోటల్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి ఐదు ద్విచక్ర వాహనాలు, రూ.27,400 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ చెప్పారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ఆగిరిపల్లి: స్థానిక మండల వ్యవసాయ అధికారి కార్యాలయంలో ధాన్యం కొనుగోలుపై సిబ్బందికి సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి చెన్నారావు మాట్లాడుతూ మండలంలో 9 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఈక్రాప్, కేవైసీలు పూర్తి చేసిన రైతులందరూ ప్రమాణాలు పాటించి తమ ధాన్యాన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా విక్రయించుకోవాలని సూచించారు. తేమ శాతం ఎంత ఉండాలి, ధాన్యం కొనుగోలు చేసేటప్పుడు ఎటువంటి జాగ్రత్తలు పాటించాలో సిబ్బందికి ఏలూరు జిల్లా సివిల్ సప్లయి ఆఫీస్ టెక్నికల్ అసిస్టెంట్ స్రవంతి వివరించారు. ఈ కార్యక్రమంలో డెప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్, వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేలో 37 దరఖాస్తులు

చంద్రుపట్ల(విస్సన్నపేట): రీ సర్వేలో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి గ్రామంలో నిర్వహిస్తున్న గ్రామ సభను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కె.లక్ష్మీకళ్యాణి అన్నారు. మండలంలోని చంద్రుపట్ల గ్రామ సచివాలయం వద్ద రీ సర్వేలో వచ్చిన భూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరణకు గ్రామ సభ సోమవారం నిర్వహించారు. రైతుల నుంచి 37 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ తెలిపారు. సర్పంచ్ బి. బాలకొండయ్య పాల్గొన్నారు.